RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శుక్రవారం 09.01.2026 సంపుటి : 03 సంచిక : 39 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Friday 09.01.2026 Volume: 03 Issue 39 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర



2

## ఏఐకి కేరాఫ్‌గా హైదరాబాద్

### ఏఐని అభివృద్ధి చేసే సంస్థలకు ప్రోత్సాహం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కృత్రిమ మేధ సాంకేతికలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం నాడు ఆయన హైటెక్ సిటీలో ఎయిడెన్ ఏఐ ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు.

6

## పురపోరులో కాంగ్రెస్ జెండా ఎగరాలి



6

గడిచిన రెండేళ్లుగా అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధించిన మనం.. రేపటి కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లోనూ పూర్తిస్థాయి మెజారిటీ సాధించాలి. అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి అంటూ పార్టీ నేతలు, కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

- మున్సిపల్ పోరులోనూ పూర్తి మెజారిటీ రావాలి
- మంత్రుల నుంచి నిధులు మంజూరు చేయించుకునే నాయకులే స్థానిక ప్రజా ప్రతినిధులుగా ఉండాలి
- ఈ విషయాన్ని చెబితే ప్రజలూ మనల్ని ఆశీర్వదిస్తారు
- అధికారంలో ఉన్నాం కాబట్టే మనమాట వింటున్నారు
- లేదంటే ఫుట్‌బాల్ ఆట చూసేందుకు పాస్ కూడా రాదు
- కార్యకర్తలను గెలిపించడానికి ఇల్లిల్లూ తిరుగుతా
- టీపీసీసీ విస్తృతస్థాయి భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

## 'వేదాంత' సంపదలో 75% సమాజానికే



పారిశ్రామికవేత్త అగర్వాల్ వెల్లడి

కుమారుడి మరణంపై తీవ్ర ఆవేదన

5

## వాహనాల రిజిస్ట్రేషన్ మరింత సులభతరం

అధికృత డీలర్‌కే శాశ్వత రిజిస్ట్రేషన్ బాధ్యత : రవాణాశాఖ



**హైదరాబాద్, జనవరి 7 :** కొత్తగా వాహనాల రిజిస్ట్రేషన్ ప్రకియను మరింత సులభతరం చేస్తూ రాష్ట్ర రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. ఇకపై కొత్తగా కొనుగోలు చేసే నాన్ ట్రాన్స్‌పోర్ట్ మోటర్ సైకిళ్లు, కార్లకు మొదటి రిజిస్ట్రేషన్ సమయంలో వాహనాన్ని ఆర్టీవో కార్యాలయానికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నది. వాహనం కొనుగోలు చేసిన తర్వాతే అధికృత డీలర్ శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారని వెల్లడించింది. అవసరమైన పత్రాలు డీలర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని వివరించింది. రవాణాశాఖ అధికారి దరఖాస్తును పరిశీలించి, రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారని తెలిపింది. స్పీడ్ పోస్ట్ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) యజమానికి పంపనున్నట్టు తెలిపింది. ఈ విధానంతో సమయం ఆదా అవడంతోపాటు వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కానున్నట్టు పేర్కొన్నది. ఈ కొత్త విధానం కేవలం కార్లు, బైక్‌లకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. వాణిజ్య వాహనాలకు వర్తించదని వెల్లడించింది.

## 'బాగున్నరా అమ్మ'

### ఇంటికొచ్చిన మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ పలకరింపు



**ఎర్రవెల్లి :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులను 'బాగున్నరా అమ్మ' అంటూ ఆత్మీయంగా పలకరించారు. వారికి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ వారికి అతిథి మర్యాదలు చేశారు. సంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలు, చీర, తాంబూలాలతో ఆ ఆడబిడ్డలను సత్కరించారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షమ శాఖల మంత్రి దనసరి సీతక్క గురువారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లి, వారిని మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు రావాలని ప్రభుత్వం తరపున ఆహ్వానించారు. మరికొద్ది రోజుల్లో మేడారం జాతర ప్రారంభం కానుండటంతో జాతరను సందర్శించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందును మహిళా మంత్రులు స్వీకరించారు. కాసేపు పరస్పర యోగక్షమాల గురించి వారు మాట్లాడుకున్నారు. ఇష్టాగోష్టి అనంతరం మహిళా మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతకుముందు మహిళా మంత్రులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం దగ్గర వాహనాలు దిగగానే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.

# కోల్‌కతాలో ఐ-ప్యాక్ సంస్థపై ఈడీ దాడులు

**తీవ్రంగా ఖండించిన సీఎం మమత**

కోల్‌కతాలోని పొలిటికల్ కన్సల్టెన్సీ ఐ-ప్యాక్ సంస్థపై గురువారం ఉదయం ఈడీ దాడులు చేసింది. ఐ-ప్యాక్ సంస్థకు చెందిన కీలక అధికారి ప్రతీక్ జైన్ ఇంటితోపాటు, వి.సాల్ట్ లేక్ లోని ఐ-ప్యాక్ ఆఫీసుపై కూడా ఈడీ దాడులు కొనసాగిస్తోంది. మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈ సోదాలు జరుపుతోంది. ప్రతీక్ జైన్.. మమత ఆధ్వర్యంలోని టీఎంసీ పార్టీ కోసం పని చేసే కీలక వ్యక్తి. టీఎంసీ కోసం రాజకీయ వ్యూహాలు రచిస్తుంటారు. దీంతో తనకు అనుకూలమైన ప్రతీక్ జైన్ ఇల్లు, కార్యాలయంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ దాడులు చేయడాన్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. దాడులు జరుగుతున్న సమయంలోనే మమత, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లారు. తన పార్టీకి సంబంధించిన కీలక పత్రాల్ని తాను తీసుకున్నట్లు మమత తెలిపారు. తమ పార్టీకి సంబంధించిన అభ్యర్థుల వివరాలు, రాజకీయ, ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీ ఈ దాడులు చేస్తోందని మమత ఆరోపించారు. తాము కూడా బీజేపీ ఆఫీసుపై దాడులు చేస్తే ఎలా ఉంటుంది అని మమత ప్రశ్నించారు. తన చేతిలో ఒక ఫైల్ తో మమత మీడియాతో మాట్లాడారు. అలాగే, ఐ-ప్యాక్ ఆఫీసుకు కూడా ఆమె చేరుకున్నారు. ఈడీ దాడులు జరుగుతుండగా.. ఆఫీసు బయట టీఎంసీ కార్యకర్తలు అక్కడ నిరసనలు చేస్తున్నారు.మరోవైపు ఐ-ప్యాక్ ఆఫీసు వద్ద కేంద్ర బలగాల్ని కూడా మోహరించారు. పోలీసు ఉన్నతాధికారులు కూడా పరిస్తితిని సమీక్షస్తున్నారు. మరోవైపు ఈడీ దాడులు జరుగుతున్న వ్యక్తి ఇంటికి సీఎం వెళ్లడాన్ని ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికార్ ఖండించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల విధులకు మమత ఆటంకం కలిగించడం పనిగా పెట్టుకుందని, ఆమెపై ఈడీ



చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మమత చర్య అనైతికం అని మండిపడ్డారు.

# ఘనంగా సీఎం కప్-2026 ప్రారంభం

**జనోదయ: జైపూర్**

ప్రభుత్వం క్రీడల అభివృద్ధి, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2026 కార్యక్రమం జైపూర్ మండలంలో శుభారంభం పొందింది. ఈ సందర్భంగా మండల అధికారులు, విద్యార్థులు కలిసి నిర్వహించిన టార్చ్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించి, క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు పేర్కొన్నారు. పోటీల్లో వివిధ క్రీడాంశాలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహకాలు, శిక్షణ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.వివరాల ప్రకారం ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామ స్థాయిలో, 28 నుంచి 31 వరకు మండల స్థాయిలో, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో, అలాగే ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అధికారులు తెలిపారు.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత అధికారులు, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, పంచాయతీ కార్యదర్శులు, క్రీడా సంఘాలు, యువత సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని అమలు



చేయాలని కోరారు.ఈ ప్రారంభ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. సత్యనారాయణ, తహసిల్దార్ కె. వనజారెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, మండల విద్యాధికారి శ్రీనివాస్, ఉన్నత పాఠశాల పిడి గోపాల్, ఉపాధ్యాయులు, జైపూర్ గ్రామ సర్పంచ్ కె. భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు ఏ. సుమన్, బి. ఉద య్ కుమార్, టి. శ్రీనివాస్, డి. రజిత, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

**ఉపాధి హామీతో విప్లవాత్మక మార్పులు**

**పథకం మార్పువెనక మోడీ కుట్ర**

**కార్పోరేట్ వ్యవస్థలకు దోచిపెట్టడానికే పేరు మార్పు**

**వికసిత్ భారత్‌కాదు ...సంక్షోభిత భారత్**

**కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నాం**

**వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవే**

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 8:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, దేశవ్యాప్తంగా దీనికి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో పీసీసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని



పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

# హౌలాగాళ్లలా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు

**హాస్పిటల్ తెచ్చానని ఒకాయన, మున్సిపాలిటీ కాకుండా అడ్డుపడ్డానని ఒకాయన**

**ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు**

**నిరుపేదలకు వరం కల్యాణ లక్ష్మీ పథకం**

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**జనోదయ, స్టేషన్ ఘన్పూర్, జనవరి 8:**

కొంత మంది హౌలాగాళ్ళు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, ఎలాంటి ఆధారాలు లేకుండా నిస్సిగ్గుగా మాట్లాడటం వాళ్లకు అలవాటైందని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరోక్షంగా బిఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. ఒకాయన నేనే 100పడకల అస్పత్రి తెచ్చాను అంటాడు, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కాకుండా అడ్డుపడ్డానని అంటాడు... ఇలా మాట్లాడే వాళ్లకు చదువు వస్తుందా, బుద్ధి జ్ఞానం ఏమైనా ఉన్నాయా అని ధ్వజమెత్తారు. జఫర్ గడ్ మండల కేంద్రం, స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మ, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జఫర్ గడ్, ఐనవోలు మండలాలకు సంబందించిన 77మంది కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు 77లక్షల 08వేల 932రూపాయల విలువగల చెక్కులను, 30మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 10లక్షల 52వేల 500రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. అలాగే స్టేషన్ ఘనపూర్ మండలానికి సంబందించిన 66మంది కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు 66లక్షల 07వేల 656రూపాయల విలువగల చెక్కులను, 22మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 11లక్షల 18వేల 500 రూపాయల విలువగల చెక్కులను పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా సంక్షమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కల్యాణ లక్ష్మ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న రెండు నెలలో చెక్కులు అందజేస్తున్నామని, ఇందుకు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే తనకు చెప్పాలని సూచించారు.



**ప్రజా సంక్షేమమే ముఖ్యం...**

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు ఉచిత సన్న బియ్యం పంపిణి, నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు, ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉందని అందుకు కారణం మన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గమేనని తెలిపారు. నియోజకవర్గంలో 93శాతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టమని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదన్నారు.

**జీవోల పత్రాలను చూసుకోండి...**

జనవరి 2024తర్వాత వచ్చిన జీవోల ఆధారంగానే నియోజకవర్గానికి మంజూరు అయిన అభివృద్ధి పనుల వివరాలను జీవో కాపీలతో సహా మీడియా ముందు, ప్రజల ముందు పెట్టానని, అవి చూసుకొని మాట్లాడాలని సూచించారు. నాకున్న ఏకైక లక్ష్యం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రగతి, ప్రజల సంక్షేమం మాత్రమేనని వెల్లడించారు. కార్యక్రమంలో ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, తహసీల్దార్లు, సర్పంచులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యానికి నిలువుటద్దం




తాళం వేసి దర్శనమిస్తున్న పాత వరిపేట ప్రాథమిక పాఠశాల

**మధ్యాహ్నం వేళ పాఠశాలకు తాళం**

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 8:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండల పరిధిలోగల పాత వరి పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గురువారం మధ్యాహ్నం తాళం వేసి ఉపాధ్యాయుడి నింక్ష్యానికి నిలువుటద్దంగా దర్శనమిచ్చింది. ప్రభుత్వం విద్యకు ఎనలేని ప్రాముఖ్యతనిస్తుందని జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ అధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ ఏజెన్సీ గ్రామాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తుంది. పాత వరిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రాకపోవడంతో ఉపాధ్యాయుడు ప్రతిరోజు మధ్యాహ్నం పాఠశాలకు తాళం వేసి వెళ్ళిపోతున్నాడని స్థానికులు తెలిపారు. మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. స్థానిక విద్యాశాఖ అధికారులు ఏజెన్సీ గ్రామాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించిన సింగరేణి అధికారులు



**జనోదయ, బెల్లంపల్లి**

కాసిపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను గురువారం సింగరేణి అధికారులు పరిశీలించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేసిన మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి సోలార్ లైట్లు, మురికి కాలువలు, నీటి శుద్ధి యంత్రాలు, కల్వర్టులు మంజూరయ్యేలా కృషిచేసిన సర్పంచ్ బాదావత్ నీల రామచందర్,ఏజెంట్ రాంబాబు, మేనేజర్ సతీష్, సభ్యుల అధికారులు రాము, శ్రీధర్, కార్మిక సంఘాల నాయకులు దాగం మల్లేష్, బన్న లక్ష్మణ్ దాస్ లకు గ్రామస్తులు, యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190


# ప్రభుత్వ భూముల అక్రమాలపై ప్రశ్నిస్తే నోటీసులా?

**మీడియాను**

**భయపెట్టే ప్రయత్నం సరికాదు**

**టీఎంజేయు జిల్లా అధ్యక్షులు**

**చందా శ్రీనివాస్**

**జనోదయ,మరిపెడ, జనవరి 8 :**



మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల అక్రమాలపై ఆధారాలతో వార్తలు ప్రచురించిన జర్నలిస్టు బోయిని నరేందర్ ముదిరాజ్‌కు లీగల్ నోటీసులు పంపడం సరికాదని తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు చందా శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. కురవి మండల కేంద్రంలో తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టు నరేందర్ ముదిరాజ్ సంఘానికి తెలిపిన వివరాల ప్రకారం, కురవి మండలంలోని 747 సర్వే నంబర్‌కు చెందిన విలువైన ప్రభుత్వ భూమిని సుమారు మూడేళ్ల క్రితం ఓ రెవెన్యూ శాఖ ఉద్యోగి అక్రమంగా విక్రయానికి గురి చేసిన విషయాన్ని జర్నలిస్టులు పక్కా ఆధారాలతో వెలుగులోకి తెచ్చారని తెలిపారు. ప్రభుత్వ భూముల అక్రమాలపై ప్రశ్నించిన జర్నలిస్టుకు లీగల్ నోటీసులు పంపడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇది స్వేచ్ఛా యుత మీడియాను భయపెట్టే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. ప్రజల తరపున ప్రశ్నించే మీడియాను అణచివేయాలని చూస్తే జర్నలిస్టు సంఘాలు మౌనంగా ఉండవని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులు, భద్రత కోసం తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని చందా శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సమావేశంలో తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేతమళ్ళ సహదేవ్,జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డ అశోక్,జిల్లా నాయకులు గండమాల రోషయ్య, జర్నలిస్టు బోయిని నరేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

**120 గ్రాముల గంజాయి స్వాధీనం**




**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 8:**

నిషేధిత గంజాయి కేసులో ముగ్గురు యువకులను గురువారం అరెస్టు చేసినట్లు కన్నెపల్లి ఎస్ ఐ భాస్కర రావు తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ ముగ్గురు యువకులను తాండూర్ సీఐ దేవయ్య ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. ఎస్ ఐ భాస్కర్ రావు కథనం ప్రకారం కన్నెపల్లి సబ్ స్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా సుందిళ్ల ప్రభాకర్(చింతపూడి), రౌతు మారుతి(లింగాల) అనే ఇద్దరు యువకులు బైక్ పై అనుమానాస్పదంగా కనిపించారని, పోలీసులను చూసి పారిపోతున్న వీరిని పట్టుకొని సోదా చేయగా 20 గ్రాముల గంజాయి లభించింది. వీరికి బెల్లంపల్లి రడగంబల బస్తికి చెందిన పిడుగురాళ్ల చందర్ అనే వ్యక్తి అమ్మినట్లు తెలియడంతో అతని ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభించింది. 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని ఈ ముగ్గురిని తాండూర్ సీఐ దేవయ్య ఎదుట హాజరు పరిచారు. గంజాయి కలిగి ఉన్న వ్యక్తులను పట్టుకున్న ఎస్ ఐ భాస్కర రావు, పోలీస్ సిబ్బందిని సిఐ దేవయ్య అభినందించారు.

# బుగ్గలో సమ్మక్క జాతర ఏర్పాట్లు ప్రారంభం

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 8:**



బెల్లంపల్లి, కాసిపేట మండలాల పరిధిలోని బుగ్గగూడెం అటవీ ప్రాంతంలో సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇక్కడ 2012లో మొదటిసారిగా జాతరను ప్రారంభించారు. 2026 న 6 వ సారి జాతరను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 28, 29, 30 లలో మేడారం జాతరను అనుసరించి బుగ్గ సమ్మక్క జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. బుగ్గ అటవీ ప్రాంతంలో సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంతంలో పూజల కోసం స్థలాన్ని చదును చేస్తున్నారు. బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, మందమర్రి, నెన్నల్ ప్రాంతాలు ప్రజలతోపాటు సింగరేణి కార్మిక కుటుంబాలు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈసారి సౌకర్యాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుగ్గ సమ్మక్క జాతర నిర్వాహక కమిటీ సభ్యులు పెంద్రం లాల్ పటేల్(కరిశల ఘట్టం), మాడావి రాము (కరిశెల ఘట్టం), గుండ గణపతి (బుగ్గ గూడెం), నవనందుల వెంకటి (బుగ్గ గూడెం), గుండ తిరుపతి (బుగ్గ గూడెం), పడాల రాజన్న (బుగ్గ గూడెం), జంజిరాల రాజు (వరి పేట), గుండేటి నర్సయ్య(వరి పేట), లింగాల శ్రీను (వరి పేట),సాలిగాం బానయ్య (తాండూర్), మంద అనిత (కన్నాల) ల ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు చేపడుతున్నారు.

## వాసవి క్లబ్ అధ్యక్షురాలిగా తమ్మిశెట్టి మంజుల



**జనోదయ, మందమర్రి జనవరి 8:**

వాసవి వనిత క్లబ్ పట్టణ అధ్యక్షురాలిగా తమ్మిశెట్టి మంజుల ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వాసవి వనిత క్లబ్ ప్రధాన కార్యదర్శిగా గడ్డం మాలతి, కోశాధికారిగా గంప శ్రీదేవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు తమ్మిశెట్టి మంజుల మాట్లాడుతూ నాపై నమ్మకంతో మరోసారి అధ్యక్షురాలుగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. వనిత క్లబ్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

## విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గా రమేష్ బాధ్యతలు



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 8:**

బెల్లంపల్లి విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పి. రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. విద్యుత్ శాఖలో బిల్లింగ్, కలెక్షన్ పరంగా లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా కార్యాచరణ రూపొందిస్తానని చెప్పారు. విద్యుత్ శాఖ ఆదాయం పెంపుతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనను పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# జాప్యం లేకుండా సీఎంపిఎఫ్ సేవలు

**సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్**

**జనోదయ, మందమర్రి జనవరి 8:**




సింగరేణి ఉద్యోగులకు జాప్యం లేకుండా సిఎంపిఎస్ సేవలను త్వరగా అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ఉ2 డాక్టర్ కే గోవర్ధన్ అన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంపిఎఫ్, పెన్షన్ లకు సంబంధించిన లావాదేవీలన్నీ సి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగు తున్నాయన్నారు. అలాగే కొత్తగా సీఎంపిఎఫ్ పెన్షన్‌కి సంబంధించిన క్లెయిమ్స్ త్వరగతిన పూర్తి చేయడానికి ప్రయాస్ అనే పద్ధతిని తీసుకువచ్చామన్నారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్‌గా సీఎం పిఎఫ్ పెన్షన్ సంబంధించిన క్లైములను సెటిల్ చేస్తున్నామని వివరించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సీఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. కార్మికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 375 రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్స్ (ఫార్మర్ అండ్ సర్వైవర్) సెటిల్మెంట్ కాపీలను సంబంధిత అధికారులకు అందచేశారు. ఈ సమావేశంలో ఏరియా డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, సీఎంపిఎఫ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఎస్ శ్రీనివాస రావు,ఎస్ఎస్ఓలు కే వరప్రసాద్, ఏ రాఘవేంద్ర, కే వెంకటరెడ్డి, అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# 'వేదాంత' సంపదలో 75% సమాజానికే

## పారిశ్రామికవేత్త అగర్వాల్ వెల్లడి
## కుమారుడి మరణంపై తీవ్ర ఆవేదన

**న్యూఢిల్లీ:** ప్రముఖ పారిశ్రామికవేత్త, వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ కుమారుడు అగ్నివేశ్ (49) గుండె పోటుతో అమెరికాలో మరణించారు. అనిల్ మాట్లాడుతూ, ఇది తన జీవితంలో అత్యంత చీకటి రోజు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు మెటల్స్ బిజినెస్‌లో ఉత్తమ కంపెనీల్లో ఒకటైన ఫ్యుజీరా గోల్డ్‌ను స్థాపించి, విజయవంతంగా నిర్వహించారు. హిందుస్థాన్ జింక్ చైర్మన్‌గా కూడా పని చేశారు. తన కుమారుడు ఎన్ని విజయాలు సాధించినప్పటికీ నిరాడంబరంగా, ఆత్మీయంగా, మంచి మనిషిగా వ్యవహరించారని అనిల్ తెలిపారు. ఈ విషాదం తన దాతృత్వ స్వప్నాన్ని మరింత పటిష్టపరిచిందన్నారు. తాను తన కుమారుడితో పంచుకున్న దాతృత్వ స్వప్నం మరింత బలోపేతమైందని చెప్పారు. ఆకలితో నిద్రపోయే చిన్నారి ఒకరు కూడా ఉండకూడదని, విద్యకు దూరమయ్యే బాలబాలికలు ఉండకూడదని, ప్రతి మహిళ తన కాళ్లపై తాను నిలబడగలగాలని, ప్రతి యువ భారతీయునికి అర్థవంతమైన పని దొరకాలని తాము కలలుగన్నామని వివరించారు. మేం సంపాదించిన దానిలో 75 శాతానికిపైగా సమాజానికి తిరిగి ఇస్తానని తాను తన కుమారునికి మాట ఇచ్చానని తెలిపారు. "నేడు నేను ఆ మాటను పునరుద్ధరిస్తున్నాను, మరింత నిరాడంబర జీవితాన్ని గడపాలని దృఢంగా సంకల్పించుకున్నాను" అని చెప్పారు.



# అవకాశమివ్వండి...అభివృద్ధి చేసి చూపిస్తా

### 57వ డివిజన్‌లో ప్రజల మనసు గెలవాలనే సంకల్పం
### బిఆర్ఎస్ యువ నాయకుడు బూరుగు వంశీకృష్ణ

**జనోదయ, రామగుండం జనవరి 8:** రాజకీయాలు మాటల మాయాజాలం కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే సేవా ప్రయాణమని నమ్మే యువ నాయకుడు బూరుగు వంశీకృష్ణ. భారత రాష్ట్ర సమితి తరపున రాబోయే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 57వ డివిజన్ నుంచి బరిలోకి దిగుతున్న ఆయన, ఈ డివిజన్‌ను తన కుటుంబంలా భావిస్తానని స్పష్టంగా చెబుతున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండడమే తన జీవన విధానమని, మాటలకే పరిమితం కాకుండా చూపించే సేవే తన రాజకీయ పునాదని వంశీకృష్ణ ధీమాగా పేర్కొన్నారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రోడ్ల విస్తరణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి, ఇవన్నీ తన కార్యాచరణలో కీలక అంశాలుగా ఉంటాయని వెల్లడించారు. అభివృద్ధి ఫలాలు కొద్ది మందికే పరిమితం కాకుండా మహిళలు, యువత, పేద కుటుంబాలకు చేరాలన్నదే తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు. మహిళా సంక్షేమం, వృద్ధుల గౌరవ జీవనం, యువతకు సరైన మార్గదర్శనం, పేదల సమస్యలపై తక్షణ స్పందన,ఇవే తన పాలనకు దిక్సూచి అని అన్నారు. ఏ సమస్య తలెత్తినా కార్యాలయాల్లో కూర్చోకుండా ప్రజల మధ్యకే వెళ్లి విని, పరిష్కారం చూపే విధంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.రాజకీయాల్లో నమ్మకమే అసలైన బలం అని విశ్వసించే వంశీకృష్ణ, ప్రజల ఆశీస్సులు మరియు సహకారంతో విజయం సాధించి 57వ డివిజన్ అభివృద్ధికి నిజాయితీగా పని చేస్తానని మాటిచ్చారు. సేవే శక్తిగా, ప్రజలే సాక్షిగా ముందుకు సాగాలన్న ఈ యువ నాయకుడి సంకల్పం.ఈ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా ఉండబోతోందో ఆసక్తికరంగా మారింది.



# ఏసీబీ వలలో కేయూ ఎస్ ఐ శ్రీకాంత్

### పేకాట కేసులో రూ. 15వేలు తీసుకుంటూ చిక్కిన వైనం



**జనోదయ, వరంగల్ క్రైమ్, జనవరి 8:** కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్ రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పేకాట కేసులు నిందితుడిని కేసు నుండి తప్పించేటందుకు ఎస్ఐ శ్రీకాంత్ 15 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా వారు అతనికి 15 వేలు సమ సమకూర్చినట్లుగా సమాచారం. బాధితుడు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్లో ఎస్ఐకి అందజేస్తుండగా ఏసీబీ అధికారులు వలవేసి పట్టుకున్నారు. కొత్త సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొట్టమొదటి కేసు ఎస్సైతో నమోదు కావడం గమనార్హం.

# కెకె ఓసిపిని సందర్శించిన డైరెక్టర్ తిరుమలరావు

**జనోదయ, మందమర్రి జనవరి 8:** ఏరియాలోని కెకె ఓసిపి ని సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం తిరుమలరావు సందర్శించారు. గురువారం ఏరియాలోని కేకే ఓసిపిని సందర్శించిన ఆయన గని వ్యూ పాయింట్ నుండి పని ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం పట్టణ మోడల్ స్కూల్ సమీపం లోని 28 మెగావాట్స్ సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా పవర్ ప్లాంట్ పూర్తి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన ' బీస్ ' బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పని విధానాన్ని మెరుగు పరుచుకోవడం పై సలహాలు, సూచనలు సంబంధిత అధికారులకు అందచేశారు. అంతకుముందు ఏరియా పర్యటనకు వచ్చిన డైరెక్టర్ కు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ పుష్ప గుచ్చం అందచేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సోలార్ బి సీతా రామం, ఎస్ఓటు జిఎం వై విజయ శేఖర బాబు, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి , ఎజిఎంఎస్ శ్రీనివాస్, డీజీఎం సోలార్ కార్పొరేట్ ఎం కేశవ రావు, డివైఎస్ఇ ఈఅం డీఎం ఆర్ నరేష్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.






# అభినవకు కామదేను జాతీయ అవార్డు



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 8:** తాండూర్ మండలానికి చెందిన అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అభినవ సంతోష్ తన 30 ఏళ్ల సేవలకు గాను జాతీయస్థాయిలో కామదేను జాతీయ అవార్డును అందుకున్నారు. విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామధేను అవార్డ్స్ 2025 కార్యక్రమంలో ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో బుధవారం నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు బ్రహ్మానందం, తిరుపతి శాసనసభ్యులు జై శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, తేడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫీషియల్ సభ్యులు, తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి డి. దివాకర్ రెడ్డి సమక్షంలో ఈ జాతీయ పురస్కారాన్ని దక్కించుకున్నారు.

# ఏఐకి కేరాఫ్‌గా హైదరాబాద్

## ఏఐని అభివృద్ధి చేసే సంస్థలకు ప్రోత్సాహం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**జనోదయ : హైదరాబాద్**

కృత్రిమ మేథ సాంకేతికలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం నాడు ఆయన హైటెక్ సిటీలో ఎయిడెన్ ఏఐ ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. రెండేళ్లలో తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకోసిస్టం వల్ల ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇవ్వాళ తెలంగాణా వైపు చూస్తున్నాయని ఆయన తెలిపారు. ఎయిడెన్ ఏఐలో ప్రస్తుతం 500 మంది నిపుణులు పనిచేస్తుండగా వచ్చే రెండేళ్లలో మరో 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. న్యూజెర్సీలోని ప్రిన్స్ టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ కృత్రిమ మేథలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. ఏఐని విస్తృత కార్యకలాపాలకు అభివృద్ధి చేసే సంస్థలను తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సిఇఒ కిరణ్ వెంట్రప్రగడ, సిఒఒ శ్రీని కమిడి, కవితా మురళీ కృష్ణ పాల్గొన్నారు.



# మునిసిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**పుర పోరులోనూ పూర్తి మెజారిటీ రావాలి**

**మంత్రుల నుంచి నిధులు మంజూరు చేయించుకునే నాయకులే స్థానిక ప్రజా ప్రతినిధులుగా ఉండాలి**

**ఈ విషయాన్ని చెబితే ప్రజలూ మనల్ని ఆశీర్వదిస్తారు**

**అధికారంలో ఉన్నాం కాబట్టే మనమాట వింటున్నారు**

**లేదంటే ఫుట్‌బాల్ ఆట చూసేందుకు పాస్ కూడా రాదు**

**కార్యకర్తలను గెలిపించడానికి ఇల్లిల్లూ తిరుగుతా**

**టీపీసీసీ విస్తృతస్థాయి భేటీలో రేవంత్**

**హైదరాబాద్, జనవరి 8 :** "గడిచిన రెండేళ్లుగా అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధించిన మనం.. రేపటి కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లోనూ పూర్తిస్థాయి మెజారిటీ సాధించాలి. అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి" అంటూ పార్టీ నేతలు, కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే ఎనిమిదేళ్లూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంటుందని, రాష్ట్రంలోని ఏ గల్లీలో అభివృద్ధి జరగాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. స్థానిక సంస్థలపై పట్టు ఉంటేనే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నిధులిచ్చి గల్లీలను అభివృద్ధి చేయగలుగుతారని, ఆ నిధులు మంజూరు కావాలంటే ప్రభుత్వంతో సమన్వయం చేసేవారు.. మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయించుకునేవారు స్థానిక ప్రతినిధులుగా ఉండాలని స్పష్టం చేశారు. ఇలా ప్రభుత్వం, మంత్రులతో సమన్వయం చేసుకుని నిధులు మంజూరు చేయించుకునే వారిని కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లుగా ఎన్నుకుంటే వారు ప్రాంతాన్ని అభివృద్ధి చేసారని చెప్పారు. పట్టణ ప్రాంతాల పేదలు, ప్రజలకు ఈ విషయాలను వివరిస్తే వారూ మంచి మనసుతో ఆశీర్వదిస్తారని నిర్దేశించారు. గాంధీ భవన్‌లో గురువారం జరిగిన టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో పార్టీ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేరకు సూచన చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, కార్యవర్గ సభ్యులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ప్రధానంగా మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ కార్యకర్తలు తమ ఆస్తులు, ప్రాణాలను పణంగా పెట్టి, కేసులనూ ఎదుర్కొని 2023లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. ఇప్పుడు వారి కోసం పూర్తిస్థాయి సమయం ఇచ్చి పని చేస్తున్నాం. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 66 శాతం సీట్లను గెలుచుకుని మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. బీఆర్ఎస్ 27 శాతం, బీజేపీ 6 శాతం సాధించాయి. ఆ రెండు పార్టీలూ కలిసి 33 శాతం మాత్రమే గెలుచుకున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ సాధించి అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి" అని పిలుపునిచ్చారు. గడిచిన రెండేళ్లుగా సమస్యల పరిష్కారం, నిధుల కోసం ఒక్క బీఆర్ఎస్ నాయకుడు కూడా తన వద్దకు రాలేదని, సమస్యలపై చర్చించేందుకు వాళ్లు శాసనసభకూ రావట్లేదని తప్పుబట్టారు. వాళ్లకు రాజకీయాలు, పదవులు కావాలి తప్పితే ప్రాంతాల అభివృద్ధి పట్టదని విమర్శించారు. ఇక్కడ వేదికపై ఉన్న చాలామంది మంత్రులు పార్టీ లైన్లో కష్టపడి పనిచేసి ఈ స్థాయికి వచ్చారని, సీతక్క కష్టపడి మంత్రి స్థాయికి వచ్చారు కాబట్టే.. ఇష్టదైవం సమ్మక్క, సారలమ్మ జాతరకు, వెయ్యేళ్లకు సరిపడా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించుకుని తీసుకెళ్లగలిగారని వివరించారు. కష్టపడిన వారు ఎప్పుడూ నష్టపోరని ఉద్బోధించారు. ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత ఎన్ని చెప్పినా ఎవరూ వినబోరని, జో జీతా వోహీ సికందర్ అని, ఇవాళ ప్రభుత్వం వచ్చింది కాబట్టే మన మాట వింటున్నారని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. "సర్పంచ్ ఎన్నికలకు సీఎం ఎందుకు తిరుగుతున్నాడని కొందరు మాట్లాడుతున్నారు. కార్యకర్తల కష్టంతోనే పార్టీ అధికారంలోకి వచ్చింది. నేనూ సీఎం అయ్యాను. పార్టీ నన్ను సీఎంను చేసింది కాబట్టే దునియా నన్ను చూస్తోంది. నేను ఫుట్‌బాల్ ఆడినా చూసింది. అదే పార్టీ నన్ను సీఎం చేయకుంటే ఫుట్‌బాల్ ఆట చూసేందుకు నాకు పాస్ కూడా దొరికి ఉండేది కాదు" అని వ్యాఖ్యానించారు. పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలను గెలిపించడానికి గల్లీ గల్లీ కాదు.. ఇల్లిల్లూ తిరగడానికీ తాను సిద్ధమని ప్రకటించారు. నేతలంతా పార్టీ లైన్‌లోనే వెళ్లాలని, ఎన్నికల్లో పార్టీ ఎవరికి టికెట్ ఇస్తే వారిని గెలిపించడానికి కృషి చేయాలని నిర్దేశించారు. గెలిపించడానికి ప్రయత్నం చేయని వారికి గాంధీ భవన్‌లో గుర్తింపు ఉండబోదని హెచ్చరించారు. ఇప్పుడు రాహుల్ నాయకత్వం దేశానికి అవసరమని, ఆయనకు అండగా నిలబడదామని, మోదీని ఓడించి రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు సిద్ధం అవుదామని పిలుపునిచ్చారు. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంతో (మన్‌రేగా) 140 కోట్ల మంది జనాభాలో 80 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని, చట్ట సభల్లో బలం ఉందని పథకం పేరు మార్చడంతోపాటు శాశ్వతంగా సమాధి చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.



# ఎండగడతాం తిప్పికొడతాం

## భారీ సభలకు అధికార,విపక్షాలు రెడీ



- ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్ భహిరంగ సభలు
- మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బాధ్యతలు
- ములుగు సభకు రాహుల్,సోనియాలకు ఆహ్వానం
- ప్రభుత్వ వైఫల్యాలపై సభలతో జనంలోకి బీఆర్ఎస్
- బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టే వ్యూహంలో హస్తం

**మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది.తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఫిక్స్ చేసింది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.అందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.**

**హైదరాబాద్, జనవరి 08:** మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది.తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఫిక్స్ చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శల తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది.ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.అందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

# బెల్లంపల్లిలో సీఎం కప్ ర్యాలీ




**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 8:** బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ క్రీడా మైదానం నుండి కాంటా చౌరస్తా వరకు గురువారం ఎంపీడీవో కె. మహేందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పిఈటిలు, విద్యార్థులు క్రీడా జ్యోతి తో సీఎం కప్ ర్యాలీని నిర్వహించారు. ఎంపీడీవో మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈనెల 17 నుండి 22 వరకు గ్రామస్థాయిలో, 28 నుండి 31 వరకు మండల స్థాయిలో, ఫిబ్రవరి 3 నుండి 7 వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుండి 14 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుండి 26 వరకు రాష్ట్రస్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఈ పోటీలకు చేయూత నివ్వాలని కోరారు. ఈ ర్యాలీలో ఎంపీ ఓ శ్రీనివాస్, హెచ్ఎం మహేశ్వర్ రెడ్డి, గ్రామ కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీటిలో, పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



**-హమాలీ సంఘం జిల్లా అధ్యక్షులు గోమాస ప్రకాష్-**

**జనోదయ, మందమర్రి జనవరి 8:** హమాలీ కార్మికుల సంక్షమానికి వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి కార్మికులకు ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని హమాలీ కార్మికుల సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు గోమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆదిల్ పేటలో గురువారం నిర్వహించిన హమాలీ సంఘం జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు మారిన హమాలీల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని స్థలాల్లో ప్రమాదాలు జరిగి హమాలీ కార్మికులు గాయాల పాలవుతున్నప్పటికి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హమాలి కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అసంఘటిత కార్మిక వ్యతిరేక విధానా లను నిరసిస్తూ, హమాలీ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక**

హమాలీ కార్మిక సంఘం మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా గోమాస ప్రకాష్,మండల అధ్యక్షులుగా ఎం భీమారావు, ఉపాధ్యక్షులుగా ఎస్ మనోహర్, ప్రధాన కార్యదర్శిగా కె రవి, సహాయ కార్యదర్శిగా జి సతీష్ కుమార్, కోశాధికారిగా ఎన్ సత్యనా రాయణ, కమిటీ సభ్యులుగా ఎస్ సుగు ణాకర్, ఎ రాజేందర్లు ఎన్నికయ్యారు.

# నేటి నుండి 'సంక్రాంతి' ప్రత్యేక బస్సులు

**ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన**
**మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుంది**
**ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం ప్రమాదకరం**
**ఆర్టీసీ ఆర్ఎం విజయభాను**

**జనోదయ, హనుమకొండ, జనవరి 8:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వరంగల్ రీజియన్ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసింది. వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను తెలిపిన వివరాల ప్రకారం... జనవరి 09 నుండి 13 వరకు హైదరాబాద్‌లోని ఉప్పల్ ఎక్స్ రోడ్స్ నుండి హన్మకొండ, వరంగల్ వైపు సుమారు 650 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఉప్పల్ వద్ద ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు అని అన్నారు. ప్రయాణికుల కోసం అక్కడ తాత్కాలిక బస్ షెల్టర్లు (టెంట్లు), త్రాగునీరు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేశారన్నారు.

**తిరుగు ప్రయాణంలో....**

పండుగ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణం కోసం జనవరి 16 నుండి 20 వరకు హన్మకొండ నుండే కాకుండా నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూర్, జనగామ, పరకాల, భూపాలపల్లి బస్టాండ్ల నుండి కూడా రద్దీని క్లియర్ చేయడానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రత్యేక బస్సులలో మహిళలకు 'మహాలక్ష్మి - ఉచిత ప్రయాణ సౌకర్యం' వర్తిస్తుందని, మహిళా ప్రయాణికులు సిబ్బందికి సహకరించాలని కోరారు. సంస్థ ప్రయాణికుల కోసం ఇంతటి భారీ ఏర్పాట్లు చేసినందున, ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాల బారిన పడకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.



## రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

**సీఐ. రాజ్ కుమార్**



**జనోదయ,మరిపెడ, జనవరి 8:** వాహన దారులు రోడ్డు భద్రాతా నియమాలను పాటించాలని మరిపెడ సీఐ రాజ్ కుమార్ గౌడ్ అన్నారు.మరిపెడ మండల కేంద్రంలో లైసెన్స్, నెంబర్ ప్లేట్లు,సరైన పత్రాలు లేని వాహనాలను పట్టుకొని వాహన దారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.వాహనాలను నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలను పాటించాలని సీఐ సూచించారు.వారి వెంట పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమష్టిగా పనిచేసి బిఆర్ఎస్‌ను గెలిపించండి

**మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్**

**జనోదయ,మరిపెడ, జనవరి 8:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మరిపెడ పురపాలికలోని 15 వార్డులతో పాటు చైర్మన్ స్థానంను బీఆర్ఎస్ సునాయాసంగా గెలుచుకోనుందని మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని జిల్లా గ్రంథలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు గెస్ట్ హౌస్‌లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఉప్పల నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సునాయాసంగా గెలిచారని స్పష్టం చేశారు. అదే స్పూర్తితో పురపాలక ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు



సమన్వయంతో పని చేయాలని కోరారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం బీఆర్ఎస్ పార్టీ నాయకత్వమేనని స్పష్టం చేశారు. మరిపెడ మున్సిపాలిటీ ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలతో సుస్థిరమైన అభివృద్ధి చేయటం జరిగింది అన్నారు. ఉమ్మడి జిల్లాకు ఇండోర్ స్టేడియం తలమానికంగా మారిందని, మున్సిపల్ పార్కు,మరిపెడ ఎస్సీ కాలనీలో వ్యాయామశాల, పల్లె, పట్టణ ప్రగతి పనులు, సెంట్రల్ లైటింగ్ తో మరిపెడ దేదీప్యమానంగా కాంతులీనిందని తెలిపారు. చేసిన ప్రగతిని ప్రజల ముందు ఉంచి ఓటర్లను అభ్యర్థించాలని కోరారు. సమావేశంలో డీఎస్ రవి చంద్ర,ఆయుబ్ పాషా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఉప్పల వెంకటేశ్వర్లు,గంట్ల మహిపాల్ రెడ్డి, రమణారెడ్డి,వెర్మా రెడ్డి, రమేష్ రెడ్డి, మధు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా టార్చ్ ర్యాలీ

**జనోదయ, మందమర్రి జనవరి 8:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధితో పాటు, యువత లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ 2026 లో భాగంగా టార్చ్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం లోని తెలంగాణ మోడల్ స్కూల్ నుండి పాలచెట్టు వరకు విద్యార్థులతో టార్చ్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్ రాజేశ్వర్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల యువతకు సమాన అవ కాశాలు కల్పించి, స్థానిక క్రీడల ద్వార ఆరోగ్య వంతమైన, క్రమశిక్షణ కలిగిన సమాజాన్ని నిర్మించడమే సిఎం కప్ 2026 లక్ష్యం అని అన్నారు. ఈ పోటీలలో వివిధ క్రీడాంశాలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహకాలు, శిక్షణ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 17 నుండి 22 వరకు గ్రామ స్థాయిలో, 28 నుండి 31




వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుండి 7 వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుండి 14 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుండి 26 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సీఎం కప్ పోటీల ద్వారా యువతకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ప్రతిష్టాత్మక క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, క్రీడా సంఘాలు, యువత అందరూ సమన్వయంతో పనిచేసి, పోటీలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎం సత్యనారాయణ, మండల విద్యాధికారి రమేష్ రాథోడ్, మెప్మా టీఎంసీ ఏను గు రఘురామ్, మోడల్ స్కూల్ ప్రిన్సి పాల్ సారా తస్నీమ్, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజల భద్రత కోసం**

## వాహనాలు తనిఖీలు

**హత్నూర : జనోదయ**



హత్నూర మండలం కాసాల 12వ వార్డు తెలంగాణ చౌరస్తా వద్ద నర్సాపూర్ సంగారెడ్డి వెళ్లే రహదారిలో ఎస్సై శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ఆకస్మిక వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని. డ్రైవింగ్ సమయంలో వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రజల రక్షణ కోసం ప్రధాన రహదారులు కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించమన్నారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని నేరాలను ఉల్లంఘనలను అరికట్టడానికి నిత్యం తనిఖీలు జరుగుతాయని తెలిపారు. చట్టబద్ధమైన పత్రాలు ఉన్నవారికి ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని లైసెన్స్ రిజిస్ట్రేషన్ హెల్మెట్ సీట్ బెల్ట్ పరిశీలిస్తున్నామని మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మారుతి లక్ష్మణ్ శివకుమార్ పాల్గొన్నారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208. RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 .... Printed At SUNDAY PRINTING PRESS,Rangareddy, Hyderabad - 500072 ..Cell No - 7386045673

జనోదయ

# మధురానగర్‌లో 'సైబర్ కా ఫుల్ స్టాప్' అవగాహన కార్యక్రమం

**జనోదయ – గంగాధర | జనవరి 08:** గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాలలో బుధవారం "సైబర్ కా ఫుల్ స్టాప్" అనే శీర్షికతో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగాధర ఎస్సై వంశీకృష్ణ గారు నిర్వహించి, విద్యార్థినులకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో బాలికలు సైబర్ నేరాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అందుకే ముందస్తు జాగ్రత్తలు అత్యంత అవసరమని తెలిపారు. ముఖ్యంగా మహిళా రక్షణ, పిల్లల సంరక్షణ అంశాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అవగాహన కార్యక్రమంలో భాగంగా డేటింగ్ యాప్‌ల ద్వారా జరిగే మోసాలు, సైబర్ బుల్లీయింగ్ వల్ల కలిగే మానసిక ఒత్తిడి, సైబర్ స్టాకింగ్ వంటి నేరాలు ఎలా జరుగుతాయో ఉదాహరణలతో వివరించారు. అలాగే మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ల ద్వారా జరుగుతున్న మోసాలు, నకిలీ ప్రొఫైళ్ల ద్వారా యువతిని మోసం చేసే విధానాలపై కూడా విద్యార్థినులకు స్పష్టమైన సమాచారం అందించారు.

పిల్లలపై లైంగిక వేధింపులు, ఆన్‌లైన్‌లో జరుగుతున్న దుర్వినియోగం, అశ్లీల కంటెంట్ ద్వారా బ్లాక్‌మెయిల్ చేసే సంఘటనలపై కూడా అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు ఎదురైనప్పుడూ భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదని, తెలియని లింక్‌లపై క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తులపై అంధంగా నమ్మకం పెట్టుకోవద్దని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో సైబర్ సెక్యూరిటీ ప్రతిజ్ఞ (సైబర్ సెక్యూరిటీ ప్లేడ్జ్) చేయించి, సైబర్ నేరాల నుంచి తమను తాము రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలియజేశారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థినుల్లో ధైర్యాన్ని పెంచి, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండేలా చేస్తాయని ఎస్సై వంశీకృష్ణ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు .





# గంగాధర కానిస్టేబుల్ మధుసూదన్‌కు డీజీపీ అభినందనలు, నగదు బహుమతి

## ఎన్ సి ఆర్ పి ఫిర్యాదుల పరిష్కారంలో విశిష్ట సేవలు

**జనోదయ – గంగాధర | జనవరి 08:**

గంగాధర పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ సి ఆర్ పి పోర్టల్ ద్వారా వచ్చిన సైబర్ ఫిర్యాదులను వేగంగా స్వీకరించి, ఆర్థిక మరియు ఆర్థికేతర సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించినందుకు గాను గంగాధర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మధుసూదన్‌కు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టి జి సి ఎస్. బి) నుంచి అప్రిషియేషన్ సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతి లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్, అలాగే (టి జి సి ఎస్. బి) డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ కానిస్టేబుల్ మధుసూదన్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాలపై బాధితులకు వెంటనే స్పందించి, పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడంలో చూపిన నిబద్ధతను అధికారులు ప్రశంసించారు. ఇదే సమయంలో, గంగాధర మండలంలో సైబర్ నేరాలు మరియు గంజాయి వంటి మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను గంగాధర ఎస్సై వంశీకృష్ణ ముందుండి నడిపిస్తున్నారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ యువతను అవగాహన కలిపిస్తూ సరైన దారిలో నడిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే (ఎన్ సి ఆర్ పి) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని, అలాగే మత్తుపదార్థాల వైపు వెళ్లకుండా జీవిత లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ప్రజలకు సూచిస్తున్నారు. నేరాల నివారణలో పోలీసుల చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా కీలకమని ఈ కార్యక్రమాల ద్వారా స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఒకవైపు బాధితులకు న్యాయం చేకూర్చే చర్యలు చేపడుతూనే , మరోవైపు నేరాల నివారణకు అవగాహన కార్యక్రమాలతో గంగాధర పోలీస్ స్టేషన్ పరిధిలో సమగ్ర భద్రతా వాతావరణన్ని ఏర్పరుస్తున్నారు.





నషా ముక్త్ భారత్ అవగాహన సదస్సు ( పాత ఫోటో)

# గంగాధరలో చైల్డ్ లేబర్ నిరోధానికి ఆపరేషన్ స్మైల్ తనిఖీలు

**జనోదయ –గంగాధర | జనవరి 08:** కరీంనగర్ జిల్లాలో జనవరి 1 నుంచి 31 వరకు 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు సహాయ కార్మిక అధికారి, టీ హెల్ప్‌లైన్ ప్రతినిధి మహమ్మద్ రఫీ తెలిపారు. ఆయన వంగా టీమ్ సభ్యుడిగా ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ, మిస్సింగ్ చిల్డ్రెన్, భిక్షాటనకు గురవుతున్న పిల్లలు, స్ట్రీట్ చిల్డ్రెన్, స్కూల్ డ్రాప్‌అవుట్స్, చట్టంతో విభేదించిన పిల్లలను గుర్తించి పునరావాసానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేకంగా చైల్డ్ లేబర్‌పై ఎక్కువ దృష్టి సారిస్తున్నామని తెలిపారు. చైల్డ్ అండ్ అడోలెసెంట్ లేబర్ యాక్ట్ ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను ఏ పనిలోనూ నియమించరాదని, 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లలను ప్రమాదకర పనుల్లో పెట్టకూడదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే యజమానులకు రూ.20,000 నుంచి రూ.50,000 వరకు జరిమానా, ఒకటి నుంచి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా గంగాధర ఎక్స్ రోడ్ నుంచి పోలీస్ చైన్ వైపు వెళ్లే మార్గంలో టైల్స్ పనిలో 14 ఏళ్ల బాలుడు పని చేస్తున్నట్లు గుర్తించి రిస్క్యూ చేసినట్లు అధికారులు తెలిపారు. వెంటనే బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC) ముందు హాజరు పరచగా, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. బాలుడు 14 సంవత్సరాల లోపు కావడంతో గంగాధర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఈ తనిఖీల్లో ఎస్ఐ అన్వర్, లేబర్ ఆఫీసర్, టీహెల్ప్‌లైన్ ప్రతినిధి మహమ్మద్ రఫీ, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, డీసీపీయూ (DCPU) అధికారులు, డీసీపీ యూనిట్ సిబ్బంది, అలాగే కానిస్టేబుళ్లు పాల్గొని సమన్వయంతో పనిచేశారు. పిల్లలను పనుల్లో పెట్టడం, భిక్షాటనకు ప్రేరేపించడం వంటి అక్రమ చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ చదువులో చేర్పించాలని సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎక్కడైనా చైల్డ్ లేబర్, మిస్సింగ్ చిల్డ్రెన్ లేదా స్ట్రీట్ చిల్డ్రెన్ కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. పిల్లల భవిష్యత్తు రక్షణే 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



# "ఒక వ్యక్తి కాదు... ఒక వ్యవస్థ!" నిరుపేదలకు అండగా నిలిచిన సేవా ప్రతీక దార మొండయ్య (మధు)

**జనోదయ – పెద్దపల్లి ప్రతినిది | జనవరి 08:** సమాజంలో కొందరు వ్యక్తులు ఉంటారు—వాళ్లు మాటలతో కాదు, చేతలతో మాట్లాడతారు. అలాంటి అరుదైన వ్యక్తుల్లో ఒకరు దార మొండయ్య (మధు). పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఇద్దులాపూర్ గ్రామానికి చెందిన మధు నేడు కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదు; నిరుపేదలకు అండగా, బాధితులకు భరోసాగా మారిన ఒక సేవా వ్యవస్థగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు.

కీర్తిశేషులు దార మధునవ్వ-రాజమల్లయ్య పుణ్య దంపతుల కుమారుడైన మధు, కూలీ పనులతో జీవనం సాగించిన తల్లిదండ్రుల కష్టజీవన విలువలను తన రక్తంలో మోసుకుంటూ ఎదిగారు. చిన్ననాటినుంచి పేదరికాన్ని అనుభవించిన ఆయన, ఆ అనుభవాన్నే తన బలంగా మలుచుకుని సమాజానికి దారిచూపే స్థాయికి చేరుకున్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతలతో సేవ చేయాలన్న తపన ఆయన జీవితానికి దిశానిర్దేశం చేసింది.

2004 సంవత్సరం నుంచి నేటివరకు కుటుంబ, సామాజిక సమస్యలతో అల్లాడుతున్న వందలాది బాధితులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ద్వారా న్యాయం, పరిష్కారం, భరోసా అందిస్తూ మధు అండగా నిలిచారు. "ఎక్కడ ఆపతి వచ్చినా మధు ఉన్నాడు" అనే నమ్మకం ప్రజల్లో బలంగా నెలకొంది. తన వద్దకు వచ్చిన ప్రతి బాధితుడిని కుటుంబ సభ్యుడిలా భావించి, సమస్య తీవ్రతను లోతుగా అర్థం చేసుకుని, చట్టపరమైన అవగాహనతో పాటు మానవీయ దృష్టితో పరిష్కారం చూపడం ఆయన సేవా విధానానికి ప్రతీక.

2015 నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తూ, పార్టీలు-కులాలు-మతాలకు అతీతంగా సేవలు అందిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా, ఎటువంటి స్వార్థం లేకుండా చేసిన ఈ సేవలు అనేక కుటుంబాల్లో ఆశల దీపాలు వెలిగించాయి. విద్య, వసతి, భద్రత, హక్కుల పరిరక్షణ వంటి అంశాల్లో విద్యార్థులకు అండగా నిలిచి వారి జీవితాలకు దిశానిర్దేశం చేశారు.

ఈ నిరంతర సేవలకు గుర్తింపుగా మధు ఇప్పటివరకు ఆరు జాతీయ, ఆరు రాష్ట్ర పురస్కారాలు అందుకోవడం విశేషం. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆయన పేరు—సేవకు మరో పేరుగా మారింది. ప్రస్తుతం తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడిగా, అలాగే మంథని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల-కళాశాల బాలురు పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ సేవా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

నిరుపేదల గుండెల్లో నమ్మకంగా, బాధితుల జీవితాల్లో వెలుగుగా నిలిచిన ఇలాంటి సేవా యోధులు సమాజానికి చాలా అరుదు. ప్రభుత్వం, సమాజం ఇలాంటి వ్యక్తులను తప్పక ఆదుకోవాలన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎందుకంటే—మధు లాంటి వారు ఉంటేనే సమాజానికి మనుషుల రూపంలో ఆశ కనిపిస్తుంది.









